# యక్స్-రే

జమీన్‌రైతు ఉగాది సంచిక 1968

• ఇది స్కానింగ్‌లకాలం
అది ఎక్స్-రే కాలం
ముందుంది ఇంకా ఎదిగేకాలం.

—జయప్రద

---

నేను 'యం. బి. బి. యస్' చదివేరోజుల్లో అనుకునేదాన్ని—డాక్టరయ్యాక చాలా చాలా చెయ్యాలని. కానీ తీరా డిగ్రీకాగితం చేతిలో పట్టుకుని అందమైన కాలేజీ జీవితాన్నుండి బయటపడి తీరిగ్గా ఆలోచించడం మొదలుపెట్టాక పూర్తిగా తెలిసివచ్చింది నేనేమీ చెయ్యాలేనని.

నాకు ఇష్టమైన సర్జరీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయాలనే నా కనీసపు కోర్కె తీరే అవకాశాలుకూడా కనిపించలేదు.

ఆ సబ్జక్టులో నా మార్కులు నన్ను వెక్కిరిస్తూ అంతంత మాత్రంగా వచ్చాయి.

నా కోర్కెలు, ఆశయాలు అన్నీ కలలుగానే నిలిచిపోయాయని నేను వ్యధపడే రోజుల్లో నా ఆత్మవిశ్వాసం వెనక వున్న ఒకే ఒక్క ఆశ కొన్ని వందలమైళ్ళ దూరాన్ని వెనక్కునెట్టి ఈ నెల్లూరులో నిల బెట్టింది నన్ను.

నిజానికి "సర్జన్"మీద ఆసక్తితో ఈ క్లినిక్‌లో చేరినమాట వాస్తవమేగాని, చేరిన కొన్ని రోజులకే నా ఆసక్తి వేరేవేపుకు మళ్ళించ బడింది. అది అతి అమాయకులయిన నా పేషంట్ల వింత ప్రవృత్తి.

ఆ క్లినిక్‌కు ఒక్క క్షణం విరామం లేకుండా ప్రవాహంలా వస్తున్న ప్రజానీకాన్ని చూసి, అందులో వున్న డాక్టర్ల మేధస్సును మెచ్చుకుంటూ అడుగుపెట్టాను మొదటిరోజు.

నాకారోజు తెలియలేదు.

డాక్టర్లకూ, వాళ్ళ మేధస్సుకూ అతీతంగా ఆ రోగులను ఆక ర్షించే ఒకే ఒక్క వస్తువు ఆ పెద్ద క్లినిక్‌లో ఒకమూల నల్లగామెరుస్తూ వున్న ఒక చిన్న యక్స్-రే మిషన్ అనీ, తమ శరీరంలో కనిపించ కుండా వున్న గుండెకాయనీ, ఊపిరితిత్తుల్నీ నల్లపేపరుమీదికి ఫోటోతీసి తమకు చూపించగల ఆ నల్లమిషన్ అంటే వాళ్ళకు అమితమైన భక్తి అనీను.

మొదటిరోజు నా దగ్గరకొచ్చిన మొదటి పేషంటుతో నా మొదటి పాఠం మొదలయింది. ఆమెకు సుమారు నలభైయేళ్ళు వుంటాయి. నా ప్రక్కనున్న స్టూల్‌మీద వచ్చి కూర్చుంది. నా ప్రశ్నలకు నాందిగా అడిగాను నేను "ఏం బాధమ్మా?"

"ఒళ్ళంతా నొప్పులు. మెడనరాలు గుంజుతాయి" అని అగి కొస్త సిగ్గుపడుతూ చెప్పింది, "ఫోటో తీయించుకుందామనీ...."

సావకాశంగా అన్నీ అడిగి జబ్బు లక్షణం తెలుసుకున్నాక అన్నాను.

"ఫోటో అక్కరలేదమ్మా. మంచి మందులు వ్రాసిస్తాను, జాగ్రత్తగా వాడుకో. నొప్పులు తగ్గిపోతాయి."

"నాకాడ డబ్బులేదాయె తల్లీ. ఏదో ఫోటోకని ఒక్క రూపాయి కూడబెట్టుకున్నానుగాని."

ఉలిక్కిపడ్డాను నేను.

"అదేమిటి? మందులు కొనుక్కోవడానికి డబ్బుల్లేకపోతే ఫోటో తీయించుకున్నందువల్ల ప్రయోజనమేముంది?"

జవాబు చెప్పకుండా తలవంచుకుని కూర్చుందామె. ఆమె జబ్బు ఫోటోలో చూచి చెప్పే జబ్బుకాదనీ, ఆ వున్న రూపాయిలోనే మందులు కొనుక్కొని వాడితే మంచిదని ఆమెకి అరగంటసేపు నచ్చచెప్పి మందులను వ్రాసిచ్చి పంపించ్చాను. కాని అక్కడనుండి వెళ్ళిపోయేటప్పుడు ఆమె ముఖంలో ఏ కోశానా సంతృప్తిలేదు. నాకు లెక్చర్ ఇచ్చిన ఆయాసం మాత్రం మిగిలింది.

ఆ తర్వాత వచ్చిన కేస్‌కు అడగటమే తరువాయి యక్స్‌రే వ్రాసిచ్చాను.

అతని బాధల్లా కాళ్ళలో సురసురలు, తలలో దురద. రెండు గంటల్లోనే యక్స్‌రేతో నా ఎదుటవచ్చి నిల్చున్నాడు.

నేను యక్స్‌రే చూసి ప్రక్కన పెట్టడమే తరువాయి "ఏముంది ఫోటోలో" అనడిగాడు. పరధ్యానంగా నిజం ఒప్పేసుతున్నాను నేను. "ఫోటోలో దోషం ఏమీలేదని"

వెంటనే ఇంకొక ప్రశ్న బాణంలా దూసుకొచ్చింది నామీదకు.

"ఫోటోలో ఏమీ లేకపోతే ఈ దురద, సురసురలు దేనికని?" నిజానికి నేను చెప్పినదాంట్లో అబద్ధమేమీ లేదు.

అతని గుండెకాయి, ఊపిరితిత్తులు, ఇంకా ఆ నల్లటి ఫోటోలో కనిపించే అవయవాలన్నీ సలక్షణంగా వున్నాయి. కాకపోతే ఏ లాజిక్‌తో తలలో దురదకి, ఫోటోలో గుండెకి సంబంధం లేదని అతన్ని ఎలా నమ్మించాలో నాకు బోధపడలేదు.

జరగవలసిన తప్పల్లా ముందే జరిగిపోయింది ఫోటో తీయక ముందే ఈ విషయాన్ని అతనికి చెప్పుండాల్సింది.

నేను వ్రాసిచ్చిన మందుల చీటీవేపు అనుమానంగా చూస్తూ వెళ్ళిపోయాడతను

ఆ తర్వాత మందులు అతను వాడాడో లేదో పైన ఆ దేవుడికే తెలియాలి.

మూడో కేస్‌తో కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలని ముందుగానే మనసును హెచ్చరించుకున్నాను. ఆ ముసలావిడ చెప్పినవన్నీ కాగితం మీదకెక్కించి ఆవిడచేతికి దాన్ని అందిస్తూ అన్నాను...."ఫోటో తీయించుకురామ్మా" అని. అంతే ఆవిడ శోకాలు తీయడం మొదలుపెట్టింది. ఈ పరిణామం వూహించని నేను షాక్ తిన్నాను.

"ఏం ఖర్మరా కొడకా, నాకు తెలిసీ నేనేఖర్మా ఎరగనురా భగమంతుడా. ఫోటో తీయించుకోవాల్సిన ఖర్మ రాసిపెట్టావటరా నా నొసటా" ఆమె శోకాలర్థం నాకు బోధపడటం మొదలెట్టేటంతలోనే ప్రక్కావిడ అందుకుంది "అయితే ఇయ్యి ఖర్మ జబ్బులుకదా వదినా! అనుభవించక తప్పద్దా"

నా ఎదురుగా కూర్చున్న సీనియర్ డాక్టర్ పరిమళ నా ముఖంవేపు చూసి సన్నగా నవ్వుతోంది. నాకాక్షణంలో అనిపించింది చిన్న అద్దపు ముక్కవుంటే బాగుణ్నని.

కొద్దిసేపట్లో హాస్పటల్ కాస్త వాళ్ళ వేదాంత చర్చతో పునీతమైపోయింది.

వాళ్ళు స్థిమితపడ్డాక ఆవిడకేమీ పెద్దజబ్బు లేదని బోధపరచి పంపించాను. ఆ తర్వాత వచ్చిన కేస్‌ని ఎందుకయినా మంచిదని ముందే అడిగాను—"ఎప్పుడయినా ఫోటో తీయించుకున్నావా?" అని.

"అనుకోలాక"

నా చెవులో రహస్యంగా చెప్పిన ఆ జవాబులోనే అర్థమయింది ఆవిడకు ఫోటో అంటే ఎంత మమకారమో?

ఇంతవరకు గడిచిపోయిన తన జీవిత కాలంలో ఒక్క ఫోటో అయినా దొరకనందుకు ఆమె చాలా బాధపడినట్టుంది.

ఆమె కోర్కె తీర్చగలిగినందుకు ఎంతయి సంతోషించాన్నేను.

ఆమె ముఖంనిండా సంతోషాన్ని పులుముకొని ఫోటోతో వస్తున్నపుడు అనుకున్నాను నేను. "ఎన్నిరూపాయలు ఖర్చుచేస్తే ఇంత సంతోషాన్ని కొనగలం మనం?" అని.

డాక్టర్ పరిమళ నా అవస్థలు చూసి సన్నగా నవ్వుతూ చాలా చాలా బోధపరిచేది. ఈ హస్పటల్‌కొచ్చే రోగుల అమాయకతాన్ని, వాళ్ళ కటువయిన భాష వెనకాతల వుండే మృదుత్వాన్ని.

నాకు మొదట వాళ్ళ భాష అర్థమయ్యేది కాదు.

వాళ్ళ ఏకవచన సంబోధన నాకు కోపం తెప్పించేది.

కాని రానురానూ ఆ అమాయక ప్రజల అనాగరికమైన భాష వెనక వుండే మమకారం నన్ను అకట్టుకోవటం ప్రారంభించింది.

వాళ్ళ మనస్థత్వం నాకు ఆసక్తికరమయిన సబ్జక్ట్‌గా అయిపోయింది.

ఒకరోజు ఒక పేషెంట్ వచ్చింది.

ఆమెకు బిడ్డల్లేరు.

వస్తూనే జాలిగా ముఖంపెట్టి అర్థించిందాపిల్ల.

"ఏ మిస్టిక్‌వల్ల పిల్లకాయలు కలగటంలేదో కొద్దిగా ఫోటో తీసి చెప్పు"

యధావిధిగా అడిగాను నేను—

"ఎంతకాలమైంది పెళ్ళయి?"

"వుండుండు మా ఇంటాయన్ని అడిగొస్తా" అని నేనడ్డుచెప్పే లోపలే పరిగెట్టింది.

అతి ముఖ్యమయిన తన పెళ్ళి జరిగి ఎన్నాళ్ళయిందో తెలీని ఆ అమాయకురాల్కికి గర్భసంచిలో వుండే మిస్టేక్ ఫోటోలో పడదని ఏ విధంగా చెప్పాలి?

ఈ విషయం గురించి నేనాలోచిస్తూ వుండగానే ఇంకొక పేషెం టొచ్చి ప్రక్కన బల్లమీద కూర్చుంది.

మామూలుగా మొదలెట్టాను.

"ఏమ్మా బాధ?"

"ఆరోజు చెప్పలా నీకు?" ఆమె పెదవులమీద చరునవ్వులో- "అప్పుడే మర్చిపోయావా?" అని హేళన వుంది.

"ఏమి? కడుపునొప్పా?" అన్నాను వూహించటానికి ప్రయ త్నిస్తూ.

"కదయితే"

"చీటీలేవి?"

"ఎప్పటిమాటా?" సిగ్గుపడిపోయింది.

చీటీల విషయం వచ్చేసరికి తనువచ్చి చాలా రోజులయిందన్న విషయం స్ఫురించిందామెకు.

మొలలో అతిభద్రంగా నాలుగు మడతలమధ్య పెట్టబడిన 'ఎక్స్ రే'ని మాత్రం మెల్లగా, సున్నితంగా తీసిచ్చింది.

"గుండె ఫోటో వ్రాసాను తీయించుకురా" అంటూ లేచి నిల్చున్నాను.

అప్పుడు మధ్యాహ్నం ఒంటిగంటయింది.

"ఆత్మారాముడు అల్లరి చేస్తున్నాడు" వెళ్ళబోతున్న నన్ను ఆపి మరీ అడిగిందామె.

"ఒక్కటేనా?"

"ఇంకెన్ని కావాల?"

"కడుపులో నొప్పికి వద్దనుకున్నావా? తలనొప్పి మాటేవిటి?"

"చాలా డబ్బవుతుంది" ఆ అందమైన పల్లెపడుచు అలంకార హీనమైన మెడనుచూస్తూ అన్నాను.

"అవనీ! ఏం చేస్తాం?" అని నవ్వింది.

నవ్వినప్పుడు ఆమె ముక్కెర తళుక్కున మెరిసింది.

బేరియం యక్స్రే, తల యక్స్రే, రక్తపరీక్ష వ్రాసిచ్చాను.

ఇన్ని చేయించుకోగల్గిన ఆమె 'కన్‌షల్టేషన్' ఇవ్వలేకపోతుందా అని కాగితంమీదే వ్రాసిచ్చాను. కన్‌షల్టేషన్ ఐదురూపాయిలు 'కలెక్ట్' చేయమని.

అప్పటికి నా దారికి అడ్డుతొలగి సంతృప్తితో వెళ్ళిపోయిందామె. ఆ తర్వాత రెండురోజులు కనిపించలేదు.

మూడవరోజు ఇంతకట్ట కాగితాలు, యక్స్రేలతో నా దగ్గరకు వచ్చింది.

— వాటిని మల్లెపువ్వుకంటె స్నిగ్ధంగా, బంగారుకంటె భద్రంగా తీసి నా చేతిలో వుంచింది.

యక్స్‌రేలోకి చూస్తూ ఎందుకో తలెత్తాను. ఆమె ఆసక్తిగా నా వేపు ఫోటో వేపు మార్చి మార్చి చూస్తోంది.

అట్లా చూస్తున్నప్పుడు మెరిసేముక్కెర ఆ స్థానంలో లేకపోవడం నా దృష్టి నుండి తప్పుకోలేదు.

"ఏం ఈ రోజు ముక్కుపుడక తీసేసి వచ్చావు?"

ఆమె చెప్పిన జవాబు విని నా హృదయం నిండా సానుభూతి నిండుకుంది. ఆ సానుభూతి మధ్య నుండి నన్ను నేను విమర్శించుకున్నాను.

'వాళ్ళ స్థితి తెలియకుండా ఎంత పొరపాటు చేశాను' అని.

అమాయకులయిన వాళ్ళకు తెలియదు ఎక్స్‌రే ఎప్పుడు ఎందుకు తీయించుకోవాలో అని.

విడమర్చి చెప్పకుండా "చేతిలో కలం వుందికదా!" అని వ్రాసేసాను. పైగా కన్సల్టేషన్ ఐదురూపాయలు కూడా తీసుకున్నాను. తిరిగి దానిని ఇచ్చేసే మార్గంలేదు.

ఆమె చెప్పిన కథ ఏమంటే— ప్రతిమలాడగా ప్రతిమలాడగా మార్వాడి ఆ ముచ్చటయిన ముక్కెర ఖరీదు పదిహేను రూపాయలు కట్టి చేతిలో పడేసాడు.

అందులో పన్నెండు రూపాయలు ఖర్చయిపోయింది ఫోటోల మోజు మీద. ఇక మిగిలిన మూడు రూపాయలతో మందులు కొనుక్కోవాలి. లేదా యింకేదయినా అమ్ముకోవాలి. అంతకంటె గత్యంతరం లేదు.

ఆ కథను చెపుతున్నప్పుడు ఆ అందమైన పెదాలు నవ్వుతున్నా,

కళ్ళనిండా దైన్యత వుంది ఆ ముక్కెర ఆ పల్లెపడుచుకు రాణించినంతగా మరెవ్వరికీ రాణించదు.

దానిని కోల్పోయి ఆ పిల్ల ఎంతవరకు ఆరోగ్యాన్ని పొందగలదో నేను ఊహించలేను.

ఆ ఆవేశంలో మరలా ఆ ముక్కెర కొనిచ్చి ఆ యువతి అందాన్ని అందులో చూడాలనే కోర్కె కలిగింది గాని, తీరిగ్గా ఆలోచిస్తే- అంత త్యాగిని కాను నేను. అందుకే అంత బాధ.

ప్రొద్దున్న పదకొండు గంటలకు యక్స్-రే డిపార్ట్‌మెంట్ దగ్గర జరిగే 'సీన్' చూసి తీరవల్సిందే. అంతవరకు అలసిపోయిన మనసుకు కాస్త ఆహ్లాదంగా వుంటుంది.

యక్స్-రే లన్నీ ఎవరివి వారికి పంచిపెట్టే సమయం అది. యక్స్‌రేని సూర్యుడికి అభిముఖంగా పట్టుకుని వాళ్ళకువాళ్ళే పరిశీలనగా చూసుకుంటుంటారు.

భర్తలు భార్యలకు ఒక్కొక్క భాగాన్నే చూపిస్తూ అర్థాలు చెప్తుంటారు. వాళ్ళు వినయంగా, అతి శ్రద్ధగా వింటుంటారు. మధ్యలో ఎందుకో ఆశ్చర్యపోతుంటారు కూడా-

బహుశా అతను కొద్దిగా మిగిలిపోయిన ఊపిరితిత్తి తాలూకు నల్లని భాగాన్ని గురించి వర్ణించినప్పుడు కాబోలు

మధ్యమధ్యలో వాళ్ళ బట్టలకున్న బటన్లు, పిన్నులు, తాయత్తులు జరీ అంచుల తాలూకు గుర్తులకు అర్థాలు కల్పించుకుని చెప్పుకుంటుటారు.

అంతా పూర్తిగా చెప్పాక భర్త ముఖంలో గర్వాన్నీ, భార్య ముఖంలో ఆశ్చర్యాన్నీ చూసి తీరవలసిందే.

అజ్ఞానంలో ఇంత 'హాయి' వుందని నాకు అప్పుడు మాత్రమే అర్థమవుతుంది.

ఒకరోజు నా పేద రోగులకు ఫోటో మీద వున్న నమ్మకాన్ని, డాక్టరు మీద వున్న నమ్మకంతో పోల్చి ఆలోచిస్తూ ఉన్నాను. ఇంతలో ఒక పాతిక సంవత్సరాల యువతి మూలుగుతూ వచ్చి డాక్టర్ పరిమళ పక్కన వున్న సీట్ మీద కూర్చుని తన కథంతా విశదంగా చెపుతోంది.

భర్త రోజు తాగివచ్చి తంతాడట, నిన్న కాస్త డోస్ ఎక్కువయి చావగొట్టాడట. ఏ భాగానికి ఆ భాగం పచ్చిపుండుగా వుందంటూ కళ్ళ నీళ్ళు నింపుకుంది.

"ఫోటో తీయించుకో" అంది.

మిల మిల మెరిసే కళ్ళతో డాక్టర్ వేపు ఒక్క క్షణం చూసి-

"తల్లే, నీ దయ. అదేందో ఈ తడవ ఆడొచ్చి తంతే మరలా ఎముక లిరక్కుండా గట్టిగా ఫోటోతీయమను" అంది.

నేను నాకు తెలియకుండానే పక పక నవ్వేను. వింతగా నా వేపు చూచింది ఆ రోగి.

పరిమళ నాకు కళ్ళతోనే సైగ చేసి పేషంటు వేపు తిరిగి అంది. "అట్లాగే మొదట ఫోటో తీయించుకురా. అసలు ఎముకలు విరిగాయో లేదో చూద్దాం."

ఆ పేషంటు వెళ్ళిపోయాక "అలా నవ్వితే వాళ్ళకు మన మీద నమ్మకం పోతుంది" అంది.

నిజమే పేషంట్లతో డాక్టరు వ్యవహరించడమనేది చాలా పెద్ద జాబ్. అతి జాగ్రత్తగా దానిని నిర్వహించకపోతే వాడు సర్వనాశనమై పోతాడు- నవ్వి నా తప్పును మౌనంగా ఒప్పుకున్నాను నేను.

పొడుగ్గా సన్నగా వున్న ఒక పేషంటు వచ్చి మౌనంగా కూర్చు న్నాడు. అతని మెడ తిరగడంలేదు.

"ఏమైంది మెడకు?" అడిగాను.

ఒక్క-క్షణం నావైపు నిర్లక్ష్యంగా చూచి-

"ఫోటో కావాలి" అన్నాడు.

"ఫోటో దేనికి?"

మాట్లాడలేదు.

"బాధేమయ్యా ?"

"గుండె ఫోటో కావాలి"

"తీయిస్తాను గాని ఏం బాధో చెప్పు?"

"ఫోటోలో తెలస్తదిగా"

"ఫోటోలో జబ్బు తెలుస్తుంది గాని, నీ నొప్పి ఎట్లా తెలుస్తుం దయ్యా"

"అదేలే, కొద్దిగా దగ్గు" చాలా విసుగ్గా చెప్పాడు.

అతని విసుగును పట్టించుకోకుండా "ఆ మెడకి ఏమయింది?" అన్నాను.

'నీకెందుకు అదన ప్రసంగం' అన్నట్లు ముఖం చిట్లించాడు.

ఇక నాలో ఓపిక నశించిపోయింది.

మౌనంగా ఫోటో వ్రాసిచ్చి వెళ్ళమన్నాను.

పరిమళ అతన్ని ఆపి అడిగింది.

"ఫోట్లో ఎవరికి చూపిస్తావు?"

"ఇంకెవరికి?" అని నా వైపు ఒక్క-చూపు విసిరి వెళ్ళిపోయాడు.

"మీకు జబ్బు విషయం చెప్పడానికేమో విసుక్కు-న్నాడు. ఫోటో మాత్రం మీరే చూడాలట" అని సానుభూతిగా నవ్వింది పరిమళ. పంచ రయిన నా డిగ్నిటీని దిబ్బకొట్టి నవ్వడానికి ప్రయత్నించాను. నాకు

జరిగిన అన్ని అనుభవాలకంటె భిన్నమయినదది. ఇదొక రకం దిబాయింపు సెషన్.

★ ★ ★ ★

నేను తిరిగి వెళ్ళిపోవాల్సిన రోజు వచ్చింది.

నేను ఏ సాధన కొరకయితే ఇంతదూరం పరుగు పరుగున వచ్చానో, ఆ లక్ష్యం తీరకముందే ఇంటి దగ్గరనుండి కబురు వచ్చింది- ప్రయివేట్ ప్రాక్టీస్‌కి సరంజామా తయారయిందని. అయినా నేను బాధపడలేదు.

ఈ కొద్ది కాలంలో నేను చాలా మిగుల్చుకోగలిగాను. ఈనాడు రోగాల్ని పూర్తిగా ఎదుర్కోలేకపోయినా రోగులను ఎదుర్కొనగలననే ధైర్యాన్ని నాతోపాటు మోసుకెళుతున్నాను. రోగులు ఇచ్చిన రకరకాల అనుభవాల నుండి ఆత్మస్థయిర్యాని పిండుకుని అతి జాగ్రత్తగా మూట కట్టుకుని వెళుతున్నాను.

ఏడు సంవత్సరాల అందమైన కాలేజీ జీవితాన్నుండి బయటపడి రైలెక్కుతూ అనుకున్నాను నేను ఆనాడు- "నేను ఏమి చేయగలను?" అని.

అతి స్వల్పమైన ఈ నాలుగు నెలల అనుభవం తర్వాత ఈనాడు రైలెక్కుతూ అనుకుంటున్నాను— "ఏమీ చేయలేను నేను!" అని.

వెనక్కు తప్పుకుంటున్న పినాకిని సౌందర్యాన్ని, విక్రమసింహపురి ఔన్నత్యాన్ని తలుచుకుని నిట్టూర్చి, నా ప్రయివేట్ ప్రాక్టీసుకు కావలసిన సరంజామా లిస్ట్ తయారు చెయ్యడం మొదలెట్టాను.

అందులో మొదటిది—

నాకు యింతటి మనోధైర్యాన్ని, అనుభవాన్ని కలుగచేసిన, రోగులకు ప్రీతిపాత్రమైన యక్స్-రే మిషన్.

అది నా కళ్ళ ముందు నల్లగా, తెల్లగా మెరుస్తూ నా భవిష్యత్తును రంగు రంగుల దారాల్లో బంధించింది.